# నాస్తి (న+అస్తి)

## - వెల్చేరు చంద్రశేఖర్



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*

చీకటి వెయ్యికళ్ళ రాకాసి . రాత్రి మేలుకునుండాలి ఎలా? పగలంతా పడుకుంటే రాత్రి తెలివిగా వుండం సాధ్యం మేలుకునుంటే మిగత పనులు సానుకూలంవుతాయి.

సాధ్యాసాధ్యాలు తర్వాత ముందు మేలుకునుండాలి యెప్పటిలా ఆరోజు రాత్రి ఎనిమిదిగంటలకి భోజనం చేసి పక్కమీదకి చేరా, నే పక్కమీదకి చేరిన గంటకి సాంబడు కర్ర చప్పుడు వసారాలో వినిపించింది. సాంబడికి తలుపు తీసి, వాడు లోపలికి వచ్చాక, వంటావిడ మామ్మ మంచం చూసి, పక్క బట్టలు మార్చడం మొదలుపెట్టింది అంటే మామ్మపక్కబట్టలు పాడుచేసినట్టుంది. పక్కబట్టలు మార్చి మామ్మని సుభ్రం చేసి, నూతిగట్టుదగ్గరకెళ్ళి స్నానం చేసి వచ్చింది. అంటే ఈ రాత్రి మన్మధుడి విజిట్ వుందన్నమాట.

పగలల్లా నిద్రపోవడం వల్ల... కన్నురెప్పకూడా పడటం లేదు. వంటావిడ పక్క చేరేసరికి పదిదాటి వుంటుంది. చీకటి గాఢంగా చిక్కబడి, చింతగీర్ల ధ్వని ఎక్కువైంది. గదిలో బల్లులు "చప్ చప్" అంటూ శబ్ధం చేస్తున్నాయి. లోకం నిశ్శబ్ధనిశిలోకి జారుకుంది.

మనిషికి సహనం అవసరం...దానితో చాలా పనులు చక్కబడతాయి. అనుకున్న పని అతితక్కువ ప్రయత్నంతో సానుకులపడాలి అంటే...అనుకూలమైన సమయం కోసం వేచి చూడక తప్పదు. చాలా సేపటి తర్వాత మామ్మ గదిలోఅలికిడయ్యింది. అటు తిరిగి చూసా... మామ్మ గదిలో లాంతరు వెలుగు తగ్గింది. వంటావిడ నిశ్శబ్ధంగా బైటికి వచ్చి, గుమ్మం దగ్గర నిలబడి నా గదివేపు చూసింది. అప్పుడనుమానం వచ్చింది. వంటావిడ నా చూపుని పట్టేసిందా, నేను తెలివిగా వున్నానని ఆవిడకి తెలిసిందా యెందుకక్కడ నిలబడింది? యేమిటి చూస్తోంది? నా అనుమానాలన్నీ తీరుస్తూ,వంటావిడ అడుగులోఅడుగేస్తూ వసారాలోకివెళ్ళి, వెళ్తూనే తలుపు మూసేసింది.

నేనింక ఆలస్యం చెయ్యలేదు. గబగబా లేచి దిండుకిందనుండి పెన్ టార్చి తీసా, చప్పుడు చెయ్యకుండా మామ్మగదిలోకి వెళ్ళా, మామ్మ గదిలో లాంతరు బాగా తగ్గించి వుండడం వల్ల, మసకమసకగా కనబడుతోంది. మామ్మ మంచం దగ్గరకెళ్ళి టార్చివేసి చూసా, చక్కిదవళ్ళు సాగదీసి నోరొదిలేసి వూపిరి పీలుస్తోంది మామ్మ,జీర్ణించిపోయిన చర్మం..అరిగిపోయిన యెముకల్ని... ఆశ్రయించిన ప్రాణానికింత గట్టిదనం యెలా వచ్చిందో ముక్కు దగ్గర వేలుపెట్టి చూసా. వెచ్చటి వూపిరి ఈలోకానికి పరలోకానికి ఈగాలే సంబంధం...నాలోమొదటిసారి వుద్వేగం మొదలయింది. నేను చేయదల్చుకున్నపనికి నానరాలు యెదురు తిరిగి నట్టయింది. కానీ ఆలోచనల్లో బలం పోలేదు. అవి చెప్తున్నాయి...ఆలస్యం చేస్తే వంటావిడ వచ్చేస్తుందని, మామ్మ కాళ్ళకింద దిండుతీసా దాన్నిమొహానికి ఆనించి గట్టిగా నొక్కా... యెంతసేపు నొక్కాను, యేమిటి నాకే అర్ధంకాలేదు. మామ్మలో చలనం లేదు. మొహం మీంచి దిండు తీసి ముక్కుదగ్గర వేలుపెట్టి చూసా, యిందాకటి గాలి..వెచ్చటి వూపిరి వేలికి తగల్లేదు.

అయినా యేదో అనుమానం మామ్మ అంత తొందరగా చచ్చిపోదని పెన్ టార్చివేసి మొహాన్ని పరీక్షించా..యిందాకటికన్నా నోరు తెరుచుకుంది. నోట్లో నాలుక కనిపిస్తోంది.కళ్ళు అరమోడ్పుకనుల్లా విచ్చుకున్నాయి. కళ్ళని నోటిని మూసి, దిండుని మళ్ళీ కాళ్ళకింద పెట్టా...మామ్మ పోయిందా వుందా అన్నది. రేపు వంటావిడ చెప్పాలి. మంచం దగ్గర నిలబడి క్షణం సేపు మామ్మని పరీక్షగా చూసా యిందాకటికి యిప్పటికి తేడా యేదీ కనిపించడంలేదు. టార్చి తీసుకు మామ్మ గదిలోంచి బైటికి వచ్చి వసారా తలుపు దగ్గర నిలబడ్డా...యేదో వుద్వేగం...గుండె చప్పుడు నాకే స్పష్టంగా వినబడుతోంది.

వసారాలో సాంబడు వంటావిడ యేస్థితిలో వున్నారు. ఇప్పుడే తలుపు తెరిస్తే మంచిదా లేక కాసేపు ఆగి గుండె చప్పుడు తగ్గించుకోడం మంచిదా యేదీ నిర్ణయించుకోలేని, నిస్సహాయత...సమయం ఆగిపోయింది. యెందుకింద నిశ్శబ్దంగా వుంది? ఆలోచన ముగియనేలేదు. నిశ్శబ్దాన్ని చీలుస్తూ మూలుగు తలుపువెనుక, సుఖమైన మూలుగు... నిట్టూర్పు భారంగా, వుద్వేగంగా వేగంగా..ఇంక తను యెదురు చూడక్కరలేదు. చప్పుడు చెయ్యడానికి తలుపు తెరిచి టార్చి వెలిగించి వాళ్ళమీదవేసా. నాగబంధంలో యిద్దరూ,కామశిఖరాల్లో... అగ్ని కీలల్లో... మైమరపు వదిలి నిశ్చేష్టులైపోయారు. నేను లైటార్పి వెనక్కి వచ్చి నా మంచం మీద పడుకున్నా...అనుకున్నది అనుకున్నట్టుగా జరిగింది. రేపేం జరుగుతుందో చూడాలి. ఇంక ఈలోకంతో పనిలేదు. అన్నట్టు గోడవేపు తిరిగి పడుకున్నా....

---------------------------------------

తెల్లవార్ఝామున"బాబూ బాబూ" అని సాంబడు లేపితే తెలివొచ్చింది విడీవిడని కళ్ళతో వాడ్ని చూసా, వాడు కంగారుగా "బాబూ మామ్మగారు పోయారు" అన్నాడు.

నాన్నకి కబురెళ్ళింది...మధ్యాహ్నానికి నాన్నా అమ్మా వచ్చారు. నాన్న మామ్మదగ్గర కూర్చుని యేడుపు...ఈయేడుపు నిజమా అబద్ధమా జీవితంలో ప్రతి మలుపు దగ్గర...అడుగడునా..నటన అవసరం వుంటుంది. లోకం కోసం నైతికత ...లోకాన్ని మభ్యపెట్టడానికి...ఈ నిజంలాంటి అబద్ధం అవసరం...నిజానికి విలువుంటే...అబద్ధానికి బలం వుంది. లోకం మభ్యపోవడానికి సిద్ధంగా వుంటుంది. విచిత్రం!

నాన్న కర్మ చేసారు. ఆఖరి రోజున తిరుగు ప్రయాణం నాడు యిల్లు పొలం అమ్మకానికి పెట్టమని..వూరిపెద్దలకి చెప్పి, విశాఖపట్నం చేరాం.

..............................

మామ్మ పోయిన ఆర్నెల్లకి ఇల్లూపొలం అమ్ముడయాయి. అనుకున్న దానికన్నా తక్కువ వచ్చింది.

నేను లక్షరూపాయలు డొనేషను కట్టి ఇంజనీరింగ్ చదవడానికి బెంగుళూరు వెళ్ళాను . నాన్న వుద్యోగం మానేసి యెక్స్ పోర్ట్ బిజినెస్ లో కొంత డబ్బు పెట్టారని తెలిసింది. నాన్న పెట్టిన డబ్బు తిరిగి రాలేదు. పోగొట్టుకున్నారు. ఇంకెవరితోనూ పార్టనర్ గా జాయిన్ అవకుండా స్వయంగా రొయ్యిలఎగుమతి మొదలుపెట్టారు. నాచదువు సాగుతోంది. అడిగిన డబ్బు ఇంటినుండి వస్తోంది. శలవుల్లో ఇంటికి వెళ్ళకుండా ఫ్రెండ్స్ తో తిరుగుతున్నా..

నాన్న కొత్తగా ఇల్లు కొన్నారు చాలాపెద్దఇల్లు. ..దసరా శలవులకి ఇంటికి వెళ్ళా...అందరం మారాం నాన్నలో మార్పు.... నాలో మార్పు... కానీ అమ్మలో మార్పురాలేదు. ఇంతకు ముందు ముతకచీరలు వెడల్పాటి అంచువి కట్టేది. ఇప్పుడు టెప్టెడ్ జరీవున్న చీరలు కడుతోంది. కానీ...అభిమానంలో.. అమ్మ అమ్మే... తేడాలేదు. నాన్నలో విచిత్రమైన మార్పు మాటాడేవిధానంలో వో కాన్ఫిడెన్స్...మాట్లాడ్డంలో వో విధమైన బ్యూరోక్రెటిక్ టచ్ మోడష్టి వచ్చాయి.

"ఇంజనీరింగ్ తర్వాత యేం చేద్దామనుకుంటున్నావ్?"

"మేనేజ్ మెంటులో పోస్ట్ గ్రాద్యుయేషను"

నేచెప్పిన సమాధానానికి వోహో అనలేదు...సరె అనలేదు...మరి మాట్లాడేలేదు. ఆ విధంగా ఇంజనీరింగ్ అవగానే పోస్ట్ గ్రాడ్యుయేషన్ మొదలయింది. విద్యార్థి జీవితంలో వోమస్తి వుంటుంది. వో హాయి వుంది. అందువల్ల లోకంలో జరిగేవి.. జరుగుతున్నవి. మనసుకి పట్టవు...అవసరం లేదుకూడా. కాలం హారతి కర్పూరంలా హరించిపోతుంది. అలాగే హరించిపోయింది కూడా.... యెందుకంటే చేతిలో డబ్బువుంది.

..............................

మేనేజ్ మెంటు పి.జి చేసి ఇంట్లోఅడుగుపెట్టేసరికి, జీవితం మరో మలుపు తిరుగుతుందనిగానీ.... మళ్ళీ నా తత్వానికి విరుద్ధంగా ఆలోచించాల్సివస్తుందనిగానీ... అనుకోలేదు.ఆమలుపుకి నాంది.... అమ్మశోకం... కనీకనబడని వ్యధ యెందుకు బాధపడుతోంది. అసలు బాధపడుతోందా? లేక నేను లేనిపోనివి ఆలోచిస్తున్నానా? లేదు యేదో యెందుకో బాధపడుతోంది. నాన్న ఇంట్లోవుండటంలేదు వ్యాపారనిమిత్తం ఏవో పనుల్లో బిజీగా, టూర్లు వెళ్తున్నారు. అమ్మకి దేవుడిధ్యాస ఎక్కువైంది.

-----------------------------------

ఏపని తోచక నాన్నగారి ఆఫీసుకెళ్ళా... అక్కడ పనంతా దివాకర్ చూస్తున్నాడు. దివాకర్ నాన్నకి నమ్మినబంటు. నేను ఆఫీసుకి వెళ్తున్నరోజుల్లోనే అర్థం అయింది. ఆఫీసులో నాకన్నా యెక్కువ విలువ గౌరవం దివాకర్ కి దక్కుతున్నాయి. అంటే దివాకర్ బంటుమాత్రమే కాదు మరీ ప్రత్యేకతేమిటి.

యెవరో విసిరిన జోక్ తో పరిస్థితి అయోమయంగా అర్థం అయింది. దివాకర్ నాన్నకి బావ అవుతాడు. యెలా నాన్న రెండో పెళ్ళి చేసుకున్నారని తెలిసింది. టూర్లపేరుతో నాన్నఇంటికి రాకపోడానికి కారణం బిజ్ నెస్ కాదు. సమీర, సమీర దివాకర్ చెల్లెలు. దివాకర్ నాన్నగారి ఫర్మలో అకౌంట్ టెంట్ గా జాయిన్ అయాడు. ఇద్దరూ పాతకంపెనీ యూనియన్ కార్బైడ్ కొలీగ్స్. నాన్న పెట్టిన కంపెనీకి క్లర్కులు అవసరమై, సమీరని చేర్చాడు.సమీర యయ్. యస్. సి పాసయింది. చాలా కలలు కనే వుంటుంది. కానీ మధ్యతరగతి శాపం, ఆర్థికపరిస్థితి అడ్డొచ్చి చిన్నచిన్నవుద్యోగాలు చేస్తూవయసు ముప్పైకి పెంచింది. ఇంక కలలు కల్లలు అని తేలిపోయుంటాయి.

ఆ సమయంలో నాన్నగారి ఆఫీసులో జాయిన్ అయింది. అలా జాయిన్ అయిన కొన్నాళ్ళకి నాన్నగారితో అనుబంధం పెరిగింది. నాన్న ఆమెని రెండోపెళ్ళి చేసుకున్నారు. ఇప్పుడు ఇద్దరికీ పిల్లలుకూడా యాభైఏళ్ళవయసులో నాన్నకి పిల్లలు నాకు తోబుట్టువులు. అంటే సహించలేకపోయాను. కానీ నే చేయగలిగిందేమీ లేదు. వారసత్వపు ఆస్తి, నా సాహసం వల్ల తెగింపువల్ల, నాన్నకి దక్కింది. అందుకే యెంత సరిదిద్దుకుందామన్నా మనసు, నాన్న చేసిన పనిని అంగీకరించలేదు. నేఅంగీకరించినా అంగీకరించకపోయినా సమయం వెనక్కి రాదు.

ఇది నా ఆస్తి నేను దక్కించుకోవాలి. అది పరుల పాలుకావడం గానీ, దాన్ని ఇంకొకళ్ళు పంచుకోడం కానీ నాకిష్టం లేదు. కానీ యివేవీ పైకి చెప్పుకోలేను. లోపల దాచుకోనూలేను. ఆ సమయంలోనే మావయ్య జ్ఞాపకం వచ్చాడు.

...........................

(కొనసాగింపు వచ్చేసంచికలో)

Post your comments